క్లుప్తంగా

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



బహుమతులను అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

రాపూరు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి బహుమతులు గెలుచుకోవాలని రాపూరు డిపో ఎస్‌టీఐ బహీర్‌అహ్మద్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాపూరు -గూడూరు, రాపూరు-వెంకటగిరి రోడ్డులో నడిచే బస్సుల్లో ఎక్కే ప్రయాణికులు తమ టికెట్‌పై ఫోన్ నంబర్, ఊరు రాసి బాక్స్‌లో వేయాలని తెలిపారు. 15 రోజులకొకసారి లక్కీడిప్ నిర్వహించి ఆరుగురిని ఎంపికచేసి బహుమతులు అందజేస్తామన్నారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ మృతి



దొరస్వామి(ఫైల్)

దొరవారిసత్రం : మండలంలోని ఏకొల్లు ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు యగాని దొరస్వామి(42) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు రోజుల క్రితం పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఒక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని బుధవారం పలువురు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చెరువులోకి చేప పిల్లలు

పెళ్లకూరు: మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు ఆధ్వర్యంలో బుధవారం జీలపాటూరు చెరువులో పీఎంఎంఎస్‌వై పథకం కింద లక్ష చేప పిల్లలను వదిలారు. చేప పిల్లల పెంపకం బాధ్యతలను స్థానిక గిరిజన సంక్షేమ సంఘానికి అప్పగించారు. సొసైటీ ప్రెసిడెంట్ నాగరాజు, పుష్పరాజ్, వెంకటరమణ పాల్గొన్నారు.

వెంకట సుబ్బారెడ్డికి నివాళి

నాయుడుపేట టౌన్ : మండలంలోని అయ్యప్పరెడ్డి పాళెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జి.వెంకట సుబ్బారెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకుడు కామిరెడ్డి రాజారెడ్డి బుధవారం అయ్యప్పరెడ్డి పాళెంలో జరిగిన సంతాప సభలో పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జె.వెంకటకృష్ణారెడ్డి, కె.విజయసారథిరెడ్డి, పి.తిరుపాల్, పి.వంశీకృష్ణ రెడ్డి, డీవీ రమణారెడ్డి, మోహిత్ పాల్గొన్నారు.

నేడు వెంకటగిరిలో గడప గడపకూ మన ప్రభుత్వం

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలోని 13వ వార్డులో గురువారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నేదురుమల్లి కార్యాలయ సిబ్బంది తెలిపారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

రక్త దానంతో ప్రాణదానం

గూడూరు రూరల్ : రక్త దానంతో ప్రాణదానం చేయవచ్చని జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ తెలిపారు. గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం జేవీవీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి సందీప్, మౌలాలి, చెంచునారాయణ, రామ్మోహన్, మస్తాన్, ప్రభాకర్, చిరంజీవి పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

నాయుడుపేట టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో పేదలకు అన్ని రకాల వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు డాక్టర్ రూప తెలిపారు. తుమ్మూరు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు సుబ్బారావు, మధుసూదన్, మౌనిక పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

సీఐకి సత్కారం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట సర్కిల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన డి.జగన్‌మోహన్‌రావును బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కె.జయరామయ్య, నాయకులు బి.మల్లికార్జున రెడ్డి, డి.రవి, సీహెచ్ చెంగయ్య, పి.రాహుల్, ఎస్.చిట్టిబాబు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

డక్కిలి : పూత వచ్చిన మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని వెంకటగిరి ఉద్యానశాఖ అధికారి జి.ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం తీర్థంపాడులో మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

కండలేరులో 12.851 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 12.851 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 160 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం

- ఆటలంటే గెలవడం కాదు.. పోరాడడం
- సంక్రాంతి సంబరాల్లా ఆడుదాం ఆంధ్రా పోటీలు
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



డక్కిలి: క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



సూళ్లూరుపేట : కబడ్డీ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

డక్కిలి : యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా 50 రోజుల పండుగని, సీఎం ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థులు చదువులకే కాకుండా క్రీడల్లోనూ రాణించి మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన కొంత సేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.నారాయణరెడ్డి, వేణునాయుడు, బీ కృష్ణ, బీ భాస్కర్‌నాయుడు, ఆర్ చిరంజీవి, డీ పెంచలరెడ్డి, డీపీ యాదవ్, జీ శ్రీనివాసులునాయుడు, వీ మల్లికార్జున, కే వేణుగోపాల్, వీ చెంచయ్య, బండి రమేష్‌రెడ్డి, ఎస్ కోటేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట : ప్రస్తుత యాంత్రిక జీవనంలో క్రీడలు ఆడడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే క్రీడాకారులతో కలిసి కొంతసేపు కబడ్డీ ఆడారు. ఆయన మాట్లాడుతూ "నేను ఇదే కాలేజీలో చదువుకున్నానని, కబడ్డీని ఇష్టంగా ఆడేవాడిని" అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను సంక్రాంతి సంబరాల్లా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆటల పోటీల్లో గెలుపు ఓటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తి పొందాలన్నారు. ఈ పోటీల్లో ఏపీకి చెందిన 15 ఏళ్లు దాటిన క్రీడాకారులు ఎవరైనా పాల్గొనవచ్చునన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ కన్నంబాకం రవి, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అయితా శ్రీధర్, మార్కెటింగ్ కమిటీ సభ్యుడు మెల్లకంటి వీరాస్వామి, సూళ్లూరుపేట, తడ మండల యువజన నాయకులు జయకుమార్‌రెడ్డి, గాలి మల్లికార్జున్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు బాబూరావు, మన్నేముత్తేరి, ఆబాక సర్పంచులు చిన్నరాజా, రంజిత్, నాయకులు వెంకటసుబ్బయ్య, మనోజ్‌కుమార్, ఆట్రంబాక దొరబాబురెడ్డి, చిలకా యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం : ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.రవికుమార్ తెలిపారు. సైదాపురంలో బుధవారం సర్పంచ్ శారద ఆధ్వర్యంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. 18 వరకు మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. క్రీడా పోటీలను నెల్లూరు ఆర్డీవో మలోల పరిశీలించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వరదబండి ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొగినేని శివకుమార్, ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు, ఎంఈవో దయాకర్, పీడీ కోటేశ్వరరావు, లింగసముద్రం సర్పంచ్ వరప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి తెలిపారు. వారు బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు. నాయకులు మురళీమోహన్‌రెడ్డి, గని, మధురెడ్డి, రమణారెడ్డి, పీడీ విజయకుమారి, రాజేష్, హెచ్‌ఎం దయాకర్ పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి తెలిపారు. వాకాటివారికండ్రిగలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో బుధవారం క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈవోపీఆర్‌డీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు : స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీడీవో గోపీనాథ్, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. 20 జట్ల క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, జివ్వినట్టు సర్పంచి మధురెడ్డి, వాకాడు, జెమిన్, కొత్తపాళెం ఉప సర్పంచులు రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, వాకాటి రవి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మారుమూల ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం చెంబేడు జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవో శంకరయ్య, బెల్లపు రవిరెడ్డి, మునిరాజ, మాతయ్య, కుమారస్వామి, పరంధామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తడలో..

తడ: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. అలాగే కొండూరు పంచాయతి పులివేంద్ర గ్రామంలోని పద్మావతి విద్యాలయలో పోటీలను ప్రారంభించారు. ఎంపీడీవో అమోసుబాబు, ఎంఈవో మల్లికార్జున, ఎంపీపీ కే రఘురెడ్డి, నాయకులు టీ కోదండం, తుమ్మా జాన్ శశి, చిన్నప్పశెట్టి గోవింద శెట్టి పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : మండలంలోని కల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. తొలి రోజు క్రికెట్, కబడ్డీ తదితర పోటీలు చేపట్టినట్టు ఎంపీడీవో రఘురావయ్య తెలిపారు. ఈవోపీఆర్‌డీ మధు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటలో..

కోట : స్థానిక జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీపీ దాసరి అంజమ్మ, ఎంపీడీవో భవానీ ప్రారంభించారు. వెంకన్నపాళెం జట్టుపై చిట్టేడు విజయం సాధించింది. కొత్తపాళెం జట్టుపై కొక్కుపాడు, చెందోడు జట్టుపై కోట-3 జట్టు, గూడలి జట్టుపై ఊనుగుంటపాళెం, కోట-2 జట్టుపై వంజివాక విజయం సాధించాయి. పీఈటీలు వలీఅహ్మద్, సంధాని, క్రిష్ణ, కరీముల్లా పోటీలను పర్యవేక్షించారు.

గూడూరు రూరల్‌లో..

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు, జెడ్పీ బాలుర, విందూరు జెడ్పీ స్కూల్ క్రీడా మైదానాల్లో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికే పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు.



పోటీలను తిలకిస్తున్న నెల్లూరు ఆర్డీవో మలోల



రాపూరు: క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న దయాకర్‌రెడ్డి



పెళ్లకూరు: క్రికెట్ ఆడుతున్న డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



వాకాడు: పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు



చిల్లకూరు : క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి

చిల్లకూరు: క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించి కొంతసేపు క్రికెట్ ఆడారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రాణించిన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, ఎంపీటీసీలు, జానకిరామ్, కోటేశ్వరరావు, నాయకులు బాలక్రిష్ణారెడ్డి, దిలీప్‌రెడ్డి, కొట్టు అశోక్, యనమల అనుదీప్, కమ్మద్దీన్, ఎంపీడీవో వెంకటసూర్యసాయి, ఎంఈవోలు సనత్‌కుమార్, రవూఫ్ పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై విచారణ



టేకు చెట్లు నరికి వేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

చిల్లకూరు : మండలంలోని కడివేడు రెవెన్యూ పరిధిలో ఉన్న వివాదాస్పద భూమిలో కొంతమంది ఇటీవల టేకు చెట్లు నరికివేయడంపై తహసీల్దార్ శ్రీనివాసులు బుధవారం విచారణ చేపట్టారు. సర్వే నంబర్లు 743-800లలో ఉన్న భూమికి గ్రామానికి చెందిన ఒకరికి పట్టా భూమి ఉంది. అందులో టేకు చెట్లు ఉన్నాయి. వాటికి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో ఉన్న టేకు చెట్లను కూడా నరికి వేశారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ శ్రీనివాసులు వెంటనే వీఆర్వో బాలాజీ, సర్వే సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆర్ఐ విచారించి నివేదిక ఇస్తారని, తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

చిల్లకూరు : మండలంలోని చింతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009-10లో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం సమావేశమయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని నెమరువేసుకున్నారు. తమ అభ్యున్నతికి తోడ్పాటును అందించిన ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. హెచ్‌ఎం శివసుబ్రమణ్యం, గతంలో ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు చంద్రయ్య, సునీత, వెంకటేశ్వర్లు, సుమ, మంజుశ్రీ, వాసుదేవకుమార్, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఆకాష్‌దీపక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

చిల్లకూరు : చిల్లకూరులో గృహ సారథిగా పనిచేస్తూ అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వెందోటి మాధవయ్యను బుధవారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పరామర్శించారు. తిరుపతి జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని కోరారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే గూడూరు పట్టణం చర్చి కాంపౌండ్‌లో ఉంటున్న హాకీ కోచ్ ఆకాష్ దీపక్‌ను పరామర్శించారు. ఆకాష్ దీపక్ తండ్రి బీఎస్ఆర్ ప్రసాద్ ఇటీవల మృతి చెందారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యుడు రమణయ్య, నాయకులు కొట్టు అశోక్, యనమల అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు




విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ హారిక

గూడూరు రూరల్ : గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బ్రాహ్మణ భవన్ వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా కె.శ్రావణి, ఎస్.ప్రసూన, ఎ.రాజేశ్వరిదేవి నిలిచారు. వారికి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హారిక బహుమతులు అందజేశారు.

పేదలకు ఫల సరుకులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆడిటోరియంలో బుధవారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో అన్వేష్ తల్లి, పిల్లల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పి.మహేంద్రరెడ్డి పేదలకు నెలకు సరిపడా ఫల సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి, ఆడిటర్ రామ్మోహన్‌రావు, వాసుగౌడ్, ధనుంజయరెడ్డి, నాసిన నాగులు, తాళ్లూరి శ్రీనివాసులు, సుబ్రమణ్యం, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు సరుకులు అందజేస్తున్న డాక్టర్ మహేంద్రరెడ్డి

కూలీల సంఖ్య పెంచండి

చిల్లకూరు : ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో గిరి ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు బాగా కురవడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య తగ్గే అవకాశం ఉందన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టి కూలీల సంఖ్య తగ్గకుండా చూడాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ఓజిలి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రజినీకాంత్ తెలిపారు. మండలంలోని రాచపాళెం, ఓజిలి గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్, దీపం కనెక్షన్, అవాస్ యోజన, స్వచ్ఛ జలం తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ఆర్ఆర్ హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకులు సుబ్బారావు, ఈవోపీఆర్‌డీ మోహన్, ఏపీఎం నిర్మలమ్మ, ఏపీవో ఉషారాణి, ఏవో లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సిరాజ్‌బాషా పాల్గొన్నారు.

తిరుపతి ఆసుపత్రిలో పింఛన్ అందజేత



సూళ్లూరుపేట : మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరుకు చెందిన మారెళ్ల సుబ్బరాయలు తిరుపతిలోని రమాదేవి ఆసుపత్రి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సచివాలయ సంక్షేమ కార్యదర్శి పురిణి కృష్ణయ్య బుధవారం అక్కడికి వెళ్లి రూ.3 వేలు పింఛను అందజేశారు.

పూర్తిస్థాయిలో పింఛన్లు..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.3 వేల పింఛను పంపిణీని వంద శాతం పూర్తి చేసినట్టు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో మొత్తం 4,146 వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయని, కొత్తగా 88 మందికి పింఛను మంజూరైనట్టు పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని సాలికాలనీ 2వ సచివాలయంలో బుధవారం 4వ వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ లబ్ధిదారులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకునే పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. ఏఎన్‌ఎం మల్లీశ్వరి, వీఆర్వో బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ



నగదు అందజేస్తున్న అధికారులు, నాయకులు

సూళ్లూరుపేట : పట్టణంలోని మన్నారుపోలూరుకు చెందిన పొన్నేరి మునిరామయ్య ఈ నెల 9న అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య నాగరత్న పొదుపు గ్రూపులో వుండడంతో ఆమెకు వైఎస్సార్ బీమా నుంచి తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేశారు. కౌన్సిలర్ బందిల మహేష్, గునపాటి మునస్వామి, పూసల కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల ప్రసాద్, నాయకులు గోగుల తిరుపాల్, హరిబాబు, సచివాలయ సంక్షేమ కార్యదర్శి పురిణి కృష్ణయ్య, వలంటీర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం



డక్కిలిలో సామాజిక సమతా సంకల్పం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



చిల్లకూరు : ఏరూరులో సంతకాలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీలు

డక్కిలి : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజవకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సామాజిక సమతా సంకల్పం సంతకాల సేకరణ చేపట్టారు. ఇందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 రోజుల పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగస్వాములమదామని ప్రతి ఒక్కరూ ప్రతిన పూనాలని కోరారు. అంతకు ముందు రామ్‌కుమార్‌రెడ్డి సామాజిక సమతా సంకల్పం పోస్టర్‌ను ఆవిష్కరించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణరెడ్డి, వేణునాయుడు, భాస్కర్‌నాయుడు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేయాలి

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈనెల 5న వెంకటగిరి నియోజకవర్గ సామాజిక సాధికారిక బస్సు యాత్ర విజయవంతం చేయడంపై నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందజేయాలన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆయనకు విశేష గౌరవం ఇచ్చిందని కేవీపీఎస్ నాయకుడు కావలి బాలయ్య తెలిపారు. ఆయన బుధవారం ఏరూరు సచివాలయం వద్ద గ్రామస్తులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్‌కు ఘనమైన నివాళి అర్పించేలా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని, దీనిపై ప్రతి గ్రామంలోనూ అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలను చేపట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో ప్రజా ప్రతినిధులు



వెంకటగిరి రూరల్ : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉన్న నేపథ్యంలో వెంకటగిరి పట్టణంలో బుధవారం కౌన్సిలర్లతోపాటు మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చీపుర్లు చేత పట్టుకుని రోడ్లను శుభ్రం చేశారు.